# నర్తకి

ఒక్క క్షణం క్రితం అతి నిశ్శబ్దంగా గాలి కదలటం లేదన్నట్లున్న ఆ హాలు ఉన్నట్లుండి హోరుహోరున మోత లెత్తింది. నృత్య ప్రదర్శనం కరతాళ ధ్వనులతో ముగిసింది. రతి మెడనిండా దండలు నిండిపోతున్నాయి. అభినందనల వర్షం కురుస్తోంది. 'అద్భుతం', 'అమోఘం', 'ఆశ్చర్యం', 'ఓహో', 'ఆహా' మొదలైన మాటలు మూకుమ్మడిగా దొర్లుతున్నాయి. రతికి మెళ్ళో గులాబీలు గుచ్చుకుంటున్నాయి. గాలి చొరవీలులేని అభిమానుల గుంపుమధ్య, ఆనందము పట్టలేని రతి, పూల దండల బరువుతో భారంగా వంగి గురువుగారికి పాదాభివందనం చేసింది. గురూజీ కళ్ళల్లో ఆనందాశ్రువులు కదలాడగా, రతిని లేవనెత్తి శిరస్సు చుంబించాడు. గుంపులో ఇద్దరు ముగ్గురు, కుర్రకారు కొరకొర చూశారు.

జనం సద్దుమణిగారు. బయట సిద్ధంగా ఉన్న కారులో, గురూజీ వెళ్ళి కూర్చున్నారు. గజ్జెలు విప్పుకొని తనూ వెళ్ళాలి. వంగి గజ్జెలు విప్పుకొంటోంది.

'విలయం పుట్టించగల మీ కోమలమైన పాదాలమీద ఈ పువ్వులుపెట్టి పోదామని వచ్చాను'—

రతి వంచిన తలయెత్తి చూసింది. ఎదురుగా మొగగొంతు — చిరునవ్వు కళ్ళు — చురుక్కుమన్న చూపు.

'మీ...మీ...మీ.'

బయట కారు హారన్ మోగింది.

'ఆ...వస్తున్నా.'

ఒక కాలి గజ్జెల పట్టెడ గబగబా విప్పుకొని తొందర పాటుగా రెండడుగులేసి 'అబ్బా'అని అరచి కూర్చుండిపోయింది. గజ్జెల పట్టెడులోని గజ్జె, ఒకటి తెగి పాదానికి గుచ్చుకొంది.

'నా నివేదన తీసుకోకుండా పోతే ఎలా ?'

అతడు తెగిన గజ్జె చేతి కందించాడు. పువ్వులు పాదం మీద వుంచాడు. రతి చలించి పోయింది_అంతరాంతరాల్లో తంత్రులు తీవ్రమైన ప్రకంపనాన్ని పొందాయి. 'మీ...మీ' వణుకుతున్న పెదవులు...గొంతు పెగిలిరానిమాటలు.

'నా పేరు రాజు...'

బయట కారు హారన్ సన్నాయిలా మ్రోగింది.

'వ...వ...చ్చె' పువ్వులు, తెగిన గజ్జె చేతపట్టుకొని తొట్రుపాటుగా గేటువైపు పరుగెత్తింది. ఒంటికాలి గజ్జెలు, జాగా విడిచిన తాళంగా మోగాయి.

'బయటికి దయచెయ్యండి. తలుపు వేస్తాం' చౌకీదారు పలకరింపుతో తేరుకున్నా డతడు.

రతి నృత్యం గురించి మర్నాడు పేపర్లో పడింది. ప్రొద్దున్నే రతి తండ్రి పద్మనాభరావు పొంగిపోయాడు. ఆయనకు రతిలో ఏదో అతిలోకమైన శక్తి ఉందని మొట్టమొదటి నుంచీ నమ్మకం. ఆయన భార్య పోయినప్పటి నుంచీ రతిని గారాబంగా చూచాడు. చిన్నప్పుడు మద్రాసులో ఉండగా తంజావూరు నాట్యం చెప్పించాడు. అంతా బావుందన్నారు. తనకి ఆనందమైంది. అమ్మాయిని అంతా మెచ్చుకుంటుంటే తన జన్మ ధన్యమైనట్లుండేది. ఫలాన వారి అమ్మాయి...

అబ్బా! అని జేజేలు పలకాలి. అదే తన జీవిత లక్ష్యం అనుకున్నాడు. కాని రతి మనస్సు నృత్యంవైపు ఆసక్తమై ఉందో లేదో తెలిసికోటానికి ఎన్నడూ ప్రయత్నించలేదు. తెల్లటి కాన్వాసు మీద తన చేతి కందిన రంగు పూసేశాడు. అది అతుక్కు పోయింది.

ఆయనకు హైదరాబాదు బదిలీ అవటంతో నాట్యానికి ఆటంకం ఏర్పడినది. రతి బి. ఏ. లో చేరింది. చదువు క్రమంగా సాగుతున్నా ఆమె తండ్రికి రతి ఏదో ఖాళీగా వున్నట్లు, కాలమంతా వృథా పోతున్నట్లు అనిపించేది. రతిని వెనుకటి నాట్య పాఠాలన్నీ మర్చిపోకుండా సాధన చేస్తుండమని రోజుకు నాలుగు సార్లు హెచ్చరించేవాడు. రతికి నృత్యంమీద ప్రత్యేకమైన అభిమాన మేమిఉన్నట్లు కనిపించదు. అదొక వ్యాపకం. చదువు చూసుకుంటూ మధ్య మధ్య నాట్యం సాధన చేస్తుంటే ఏదో విశ్రాంతిగా వుంటుంది. మనస్సుకి సుఖంగా వొంటికి ఆరోగ్యంగా వుండేది. అప్పుడప్పుడు తన స్నేహితురాళ్ళు పొగుడుతుంటే కళ్ళు గర్వంగా మిలమిలలాడేవి. తల ఠీవిగా పైకెత్తి, ముందుకు వేసుకున్న వాల్జడని అలవోకగా వెనక్కు విసిరి కొట్టేది. ఆ విసురుకు జడ గంటలు గునగున లాడేవి. కొంత కాలానికి పద్మనాభ రావు గారికి గురూజీ తటస్థపడ్డారు. గురూజీ కూచిపూడి నాట్యంలో అందె వేసిన చెయ్యి. కాని ఆయన కూచిపూడి మనిషి కాడు. ఇంగ్లీషు చదువుకున్న వాడు. ఈ నాటి సమాజం అభిరుచులు తెలిసినవాడు, మిగతా భారతీయ నాట్య సంప్రదాయాలు కూడా కొద్దికొద్దిగా గ్రహించినవాడు. గీతానికి స్వయంగా నాట్య రచన చేయాలనే ఆసక్తి కలవాడు, భావుకుడు.

మర్నాటి నుంచి రతి గురూజీవద్ద నాట్యాభ్యాసం ప్రారంభించింది.

రతి ఎదిగి వస్తున్న గున్న మామిడి చెట్టల్లే ఉంది. ఆమెలో తొంగి చూస్తున్న యవ్వనం, గీతానికి, గీతావలం బనమైన నాట్యానికి నిండుతనం కూర్చుతోంది. ఆమె నవ్వులో పూర్వపు పసితనపు ఛాయ మాయమయి, గుండెలు చివ్వటం నేర్చుకున్నది. నడకలో తప్పటడుగులు పోయి, సౌందర్య విన్యాసం సమకూరింది. పాలబుగ్గల చెక్కిళ్ళు ఎరుపుదనం నించుకొని రాగరంజితా లౌతున్నాయి. చూపులు తూపు లైనాయి. అధరం ఇప్పుడు అందరికి అందరానిదైంది. తొలి సారిగా సిగ్గుపడి నేల చూడటం మొదలెట్టిన రతి వసంతమే అయింది.

గురూజీ ముప్పైనలభై మధ్య వయస్సు కలవాడు — గురూజీలో స్త్రీ ప్రకృతి ఎక్కువ పాలు మిళితమైనట్లు కన్పిస్తుంది. మాట చెప్పటములోను, నడకలోను, నవ్వులోను, స్త్రీత్వమేగాని, పురుష సహజమైన గాంభీర్యం కన్పించదు — రతిని స్వేచ్ఛగా గురూజీ శిష్యత్వానికి వదిలివేశాడు పద్మ నాభ రావుగారు.

గురూజీ తన కాలాన్ని చాలా భాగం రతికి నాట్య శిక్షణివ్వటానికి గడిపేవాడు. రతి కాలేజికి పోయినప్పుడు నాట్య విశేషాలను గురించి వ్యాసాలు రాయటం, కొత్త కొత్త పాటలకి నాట్యం కూర్చటం చేసేవాడు. ప్రతి నాట్యా నికి ముందు ప్రస్తావన తయారు చేసేవాడు. 'ఈ నాట్యం ఫలానా శతాబ్దినుండి జావా, బోర్నియో దీవుల్లో ప్రసిద్ధిగా వుండేది. ఈ భంగిమలు వెయ్యేళ్ళ క్రితం చెక్కిన మధుర

మీనాక్షీ దేవాలయముల శిల్పాలను అనుసరించి నట్టివి. ఈ నృత్యం చైతన్యస్వామి భక్తులు చేసేవాళ్ళు' – ఇట్లు పీఠికలు చెప్పేవారు. కొందరు 'అట్లాగా!' అని ఆశ్చర్య పోయేవారు. మరికొందరు ఆవులించి 'ఆ! దబాయింపు' అను కున్నా రతి నృత్య విశేషం ఈ మాటమీదికి దృష్టి పోనివ్వ కుండా ఆకట్టుకునేది.

రతి నృత్య ప్రదర్శనానికి అంతా సిద్ధపరచి మంత్రులకు, ఆఫీ సర్లకు, న్యాయవాదులకు, వర్తకులకు, కళాకారులకు ఆహ్వానాలు వెళ్ళాయి. నగరంలో అన్ని సాంస్కృతిక కార్యకలాపాలతో సంబంధం పెట్టుకున్న ఒక ప్రముఖఅధికారిని ఆశీర్వదించవలసిం దిగా అభ్యర్థించారు. ఆయన ఐదునిముషాలుఉండటానికి వెంటనే అంగీకరించాడు. దేశంలోని ప్రముఖులకు సందేశాలు పంప వలసిందిగా కోరుతూ పది రోజులు ముందుగా ఉత్తరాలు వ్రాశారు. వారు యథాశక్తి దీవిస్తూ ప్రదర్శనానికి రెండు రోజులు ముందుగానే జవాబులు వ్రాశారు. అవి చదవటానికి మరొక ప్రముఖుణ్ణి నియమించారు. పెద్దపెట్టున ఏర్పాట్లన్నీ జరిగాయి. హాలు ద్వారాలకి మామిడి తోరణాలు, దోవంట కొబ్బరిమట్టలు కట్టించారు. హాలు బయట వందమంది పోలీసుల బందోబస్తు పెట్టించారు. ప్రదర్శనం దిగ్విజయంగా ముగిసింది. మంత్రులు, ఆఫీసర్లు, వర్తకులు, కళాకార్లు అందరు గురూజీని, పద్మనాభరావు గారిని పదేపదే అభినందించి ఆకాశాని కెత్తేశారు.

రతికి ఆనాటి రాత్రి నిద్రపట్టలేదు. ప్రదర్శన దిగ్వి జయంగా పూర్తవటం, జన మంతా మూగటం అవన్నీ విశే షంగా కన్పించలేదు. రాజు తన పాదం తాకి నప్పుడు తను

వణికి పోయింది. తనలో రక్తం ఉరకలు పెట్టి పొర్లింది. పురుషుడి స్పర్శలో ఇంత శక్తి ఉండేమో! అనుకుంది. కాని గురూజీ తనకు భంగిమ కుదర నప్పుడు చాలా సార్లు తాకి చెప్పేవాడు. చేతులు విరిచేవాడు. కాని తా నెప్పుడు కదిలి పోలేదు. తన కే భావనా కలగ లేదు. తెగిన గజ్జె చేతి కివ్వటం, తన పాదముల మీాద పువ్వు లుంచటం తలుచుకొని సిగ్గుపడి పోయి చేతులతో పాదాలు కప్పేసి తల వాల్చేసుకుంది. టేబుల్ మీాద తెగిన గజ్జె ఘల్లు ఘల్లున మోగింది. లేచి ఓర మోము చేసి చూసింది. పక్కనే ఉన్న రాజు ఇచ్చిన రెండు గులాబీలు రెపరెపలాడ్తూ కవ్వించి పిలిచాయి. లేచి వెళ్ళి గజ్జెని, గులాబీలని పరుపుమీాదికి తెచ్చుకుంది. గజ్జెని మళ్ళీ మోగించింది. అర్ధరాత్రి నిశబ్దములో ఘల్లుమన్న ఆ నాదం గుండె తీగల్ని పట్టి బలంగా ఊపుతోంది. అది దేవ గానంలా ఉంది. ఆ పువ్వుల్ని తదేకంగా చూస్తూవుంటే నందనవనంలా ఉంది. గట్టిగ వక్షానికి హత్తుకుంది రతి. తెల్లవారినా ఒళ్లు తెలియలేదు రతికి.

ఇప్పుడు నాట్యం అభ్యాసం చేస్తుంటే రతికి కొత్త అనుభవం కలుగుతోంది. తన సౌందర్యం తనకి స్పష్టంగా దర్శన మిస్తున్నట్లుంది. ఒకటి రెండు సార్లు గురూజీ రతిని తాకి భంగిమ సరిచేయించ బోతే దూరంగా జరిగి తనే భంగిమ సరిగ్గా పట్టేది. గీతంలోని సాహిత్యం ఇప్పుడు సరిగ్గా బోధపడుతోంది. సాహిత్యానుగుణంగా అభినయిం పడ్తున్న ప్పుడు తన్మయపడుతోంది. రాజు గీతంలో సాక్షాత్కరిస్తు న్నాడు. తను వేస్తున్న ప్రతి పాదం అతని సామీాప్యం కోసం వేస్తున్నట్లుంది. తన హస్త విన్యాసం అతన్నే పిలుస్తుంది.

తన కళ్ళు అతణ్ణే చూస్తున్నాయి. తన మనస్సు అటే లగ్న మైంది.

'మరులు కొన్నానే! చెలిరో మరువలేకున్నానే!' అన్న జావళీ అభినయములో రతి విరహము పొందింది.

'రాడేమే ప్రియుడు! నీలమేఘశ్యాముడు!' అని వియోగంలో కంట నీరు పెట్టింది.

'వాడేచోరుడే! నందకిశోరుడే!' అని నేరంమోపుతూ కృష్ణుడి బుగ్గలు నొక్కబోయి, తన బుగ్గలు నొక్కుకొని, పవిట చాటు చేసుకొని నవ్వుకుంది.

'కొసరి కొసరి నాతో సరసములాడకు' అన్న పదం పాడుతూ మరీ మరీ, కొసరి కొసరి సంతోష సంకోచాలను అభి నయించింది – 'విడు విడు నా కొంగు' అంటూ సిగ్గు ముం చెత్తగా కుప్పకూలిపోయింది.

మీరా భజన్ అభినయిస్తున్నప్పుడు అతడు ప్రభువైనాడు. జయదేవుని అష్టపదిలో తను రాధికైతే అతడు మురళీ మోహనుడు. తను ఎంకి, అతడు నాయుడు బావ, బంగారు మావ గీతం నృత్యమైంది, నృత్యం తానైంది. తనలోని ప్రతి అణువు అతని కొరకు సిద్ధపరచబడిన పవిత్ర నైవేద్య మైంది.

పద్మనాభరావుగారు కూతురుమీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. రతి ఆంధ్రదేశంలో ప్రఖ్యాత నర్తకి కావాలి. తర్వాత మిగతా రాష్ట్రాల్లో పర్యటించాలి. కేంద్రప్రభుత్వ మన్ననలు పొందాలి. ఆ తర్వాత విదేశాల్లో ప్రదర్శనాలు. ప్రపంచ మంతా తన కూతురిని మెచ్చుకోవాలి. జనమంతా 'నాట్యలక్ష్మికి మారుపేరు రతి' అని వేనోళ్ళ పొగడాలి. ఆమె జీవితం కళకు అంకితం చేయించాలి – అని. అట్లాగే

గురూజీ కూడా...రతిచేత విరివిగా ప్రదర్శనా లిప్పించాలి. వచ్చే ప్రదర్శనానికి కొన్ని కొత్త హంగులు కూర్చాలి. ప్రభుత్వ దృష్టికి పోవాలి. సంగీత నాటక అకాడమి సభ్యత్వం దొరకాలి – ఆ తర్వాత పద్మశ్రీ తీసరావర్గ్–ఆ పైన భారతీయ నాట్యాచార్యుడు – నటరాజు కావాలి.

ఒక రోజున పద్మనాభరావు అక్కగారు పనిగట్టుకొని హైదరాబాదు వచ్చింది. కాఫీ ఫలహారాలైనాక 'విన్నావుటే అమ్మాయి పేరు ఎట్లా మోగిపోతోందో' ఆత్రంగా అన్నారు పద్మనాభరావుగారు.

'ఆఁ విన్నాను గాని ఈడొచ్చిన పిల్లకి ఇంకా ఏమిటి ఆటలు డాన్సులూను, పెళ్ళి చేయవా ఏమిటి?' అంది.

'హుష్! పెద్దగా అనకు. అమ్మాయి వింటుంది.'

'ఏం వింటే – అదేం ఆడపిల్ల కాదా?'

'నీకు తెలియదమ్మా – ఇప్పుడు పెళ్ళి సంగతెత్తితే దాని జీవితం పాడై పోతుంది.'

'మరీ చోద్యం! పెళ్ళి చేసుకుంటె బతుకు పాడవుతుందట్రా ఎక్కడన్నా?'

'నువ్వు మరీ పాతకాలపు దానివి.'

'మరీ ఈ క్రొత్త కాలం వాళ్ళేవరు పెళ్ళిళ్ళు చేసుకోవటంలా?'

'అది కాదే, నీకర్థం కావటంలేదు. రతికి పెళ్ళి చెయ్యకూడదు. రతిలో నీకు తెలియని మహావిశేషం ఉంది. దాని దృష్టి నాట్యంమీద తప్ప మరి దేనిమీద పోకూడదు. పెళ్ళి చేసుకుంటే నాట్యం దెబ్బ తింటుంది. అది కళకు అంకితమై పోవాలి.'

'ఏమిట్రా ఇందాకట్నించి చూస్తున్నాను. కళంటావ్ అంకితమంటావ్. ఇంతకీ ఆడదానికి పెళ్ళి వద్దంటావుట్రా?'

'అబ్బబ్బ! రతి అందరి ఆడవాళ్ళలా కాదే. అది సంసారంలో పడితే కళకి ద్రోహం చేసినట్లవుతుంది.'

'ఇహ వాగుడు ఆపరా. పెళ్లి చేసికొంటె ద్రోహం చేసినట్లా — పెళ్లి చేసుకోకుండా వయస్సు వచ్చినా గంతులు వేస్తూ ఉంటే బావుంటుందా—'

'నే చస్తున్నానే నీకు చెప్పలేక — ఇంక ఆ విషయం వదిలేయి.'

'అబ్బాయి! నే నొక్క మాట చెపుతున్నాను. ఆడ దాన్ని అట్లా ఉంచటం మన ఇంటా వంటా లేదు. ఏ వయస్సు ముచ్చట ఆ వయస్సుది. ఆ వయస్సులో కళ్యాణం ముచ్చట తీరకపోతే ముద్దుగా ఉండవలసిన అమ్మాయి మొద్దై కూర్చుం టుంది. తర్వాత నీ ఇష్టం.'

తలుపు చాటునుండి వింటున్న రతికి ఈ వాదన నచ్చటంలేదు. రతికి పద్మనాభరావు మాటలు అపశ్రుతులుగా తోచాయి.

ఆంధ్రాభ్యుదయ ఉత్సవాల సందర్భాన రతి నృత్యం ఏర్పాటైంది. రతికి ఈమారు ప్రదర్శన పేరు చెప్తేనే పులకరించి పోతోంది. రెండింతలుగా అలంకరించుకొంది. అద్దంముందు కూర్చుని తన్ను తాను చూసుకొంది — అద్దంలో అప్సరస పిలిచింది. తన్ను తాను కొంటెగా వెక్కిరించుకుంది. తన్ను తాను చూపుడు వేలుతో బెదరించుకుంది. నాట్య శిక్షణలో ఏపుగా పెరిగిన తన అవయవాలను చూసుకుని

మురిసిపోయింది. తన్ను తాను ముద్దు పెట్టుకుంది. చరాలున ముఖం తిప్పేసుకుంది. నృత్యం ఆరంభమైంది. రతి కన్నులు అతనికోసం వెతుకుతున్నాయి. ప్రేక్షకుల్లో రాజు ఎక్కడా కన్పించటం లేదు. విరహం, వియోగం అధికమైనాయి. ఎలుగెత్తి పిలిచింది. నీరసంతో ముఖం వాడి పోయింది. అతడి కోసం నిరీక్షణలో అభిసారికై, ఆత్మానుగతమైన భావాన్ని అభినయించింది. జనం దిగ్భ్రమ చెందారు. కార్యక్రమంలో తర్వాత నారాయణతీర్థం తరంగం. ఆ తర్వాత దశావతారములు. రతి ముఖంలో విషాదచ్ఛాయ వీడి పోలేదు. ఆమె కళ్ళు ఇంకా వెతుకుతునే ఉన్నాయి. దశావతార ఘట్టంలో ముఖంలో క్రౌర్యం రాలేదు. చకచక పడవలసిన అడుగులు మందంగా పడుతున్నాయి. ఎన్నడు లేనిది తరంగం సగం అయ్యేప్పటికి రతి అలిసిపోయింది. ఆ తర్వాత సభ రక్తి కట్ట లేదు. ప్రదర్శన అయింతర్వాత మామూలుగా అంతా దండలు వేశారు. ప్రశంసించారు. అతడు రాలేదు. అంతా వెళ్ళిపోయారు. అతడు రాలేదు. బయట కారు హారన్ మోగుతోంది. తను సమాధానం చెప్పదు. విప్పిన కాలి గజ్జెలు తిరిగి కట్టుకుంది. మళ్ళీ విప్పింది. మళ్ళీ కట్టుకుంది. గజ్జె తెగలేదు. అతడు రాలేదు. బయట కారు హారన్ దెయ్యం కూసినట్లు ఆగకుండా అరుస్తోంది. రతి లేచి వెళ్లి పోయింది.

ఇంటికి వెళ్ళాక పద్మనాభరావుగారు 'ఏం తల్లీ ! అట్లా ఉన్నావు ?' అని అడిగారు.

'అమ్మాయికి సగంలో అలుపు రాకుండా బాదంపాలు ఇంకా ఎక్కువ ఇప్పించండి' అన్నాడు గురూజీ.

'అందులో రెండు విషం చుక్కలు కలపండి సరి పోతుంది' అనుకుంది రతి.

'ఏమిటమ్మా ఒంట్లో బాగా లేదా' — అడిగాడు పద్మనాభరావుగారు.

'అవును నాన్నా' అంటూ రతి లోపలికి వెళ్ళిపోయింది.

'కొంచెం విశ్రాంతి అవసరం' అన్నాడు గురూజీ.

తర్వాత గురూజీ, పద్మనాభరావు భారతదేశములోని మిగతా రాష్ట్రాలలో రతి నృత్య ప్రదర్శనము గురించి చర్చించటం మొదలెట్టారు. ఏ రాష్ట్రంనుంచి ఏ రాష్ట్రం పోవలసింది, అక్కడ వసతులు, హంగులు ఆ వివరాలు మాట్లాడుకొన్నారు. నృత్యానికి సంబంధించిన దుస్తులు వగైరాలు కొనటానికి, ప్రయాణపు ఏర్పాట్లు పూర్తి చేసుకోవటానికి మరునాడే బయల్దేరి మద్రాసు వెళ్లాలని నిశ్చయించుకున్నారు.

ఇల్లంతా బావురుమంటోంది. రతికి ఏమీ తోచటం లేదు. గురూజీ, పద్మనాభరావు రెండురోజులక్రితము మద్రాసు వెళ్ళారు. ప్రదర్శనాల విషయంలో రతి ఇష్టాఇష్టాలు కూడా కనుక్కోలేదు. 'ఎందుకు తన కిదంతా?' అనిపిస్తోంది రతికి. పనిమనిషి పళ్ళరసం పట్టుకొస్తే వద్దని పంపించింది. ఎదురుగా టేబుల్ మీద తెగిన గజ్జె, రెండు వాడిన గులాబీలు బిక్కు-బిక్కుమంటున్నాయి.

సాయంత్రపు ఈదురుగాలికి కిటికీ తలుపులు దబదబ కొట్టుకున్నాయి. తలుపులు వేసివద్దామని లేచి వెళ్ళింది. కిటికీలోంచి వీధిలోనికి చూస్తే...అతనే....అతనే ... గేటు దాటి లోపలికి వస్తున్నాడు. ముప్పిరిగొన్న సంతోషం ఊపి

రాడ నిచ్చింది కాదు. కాళ్ళు తడబడగా ద్వారంవద్దకు పరుగె_త్తింది.

'రం...డి' మాట సగం గొంతులోనే మిగిలింది.

రాజు లోపలికి వచ్చాడు. 'ఆనాడు మీ ప్రదర్శనానికి రాలేకపోయాను' అంటూ—

కుర్చీ చూపించి కూర్చోమంది. పనిమనిషిని పిలిచి పళ్ళ రసం తెప్పించింది.

'మరి మీకో' అన్నాడు రాజు.

తనూ తెప్పించుకుంది రతి.

రతి ఏమీ మాట్లాడలేకపోయింది. మనసులో సంబరపు టలలు ఎడాపెడాకొట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తల వంచుకుని కూర్చుంది.

'ఆరోజు నాట్యం బాగా జరిగిందా?' అన్నాడతను. తల అటూ ఇటూ వూపింది. అవుననో కాదనో అర్థంకాలేదు. మూగ నిమిషాలు రెండు గడిచాయి. మూడో నిమిషం ఇలా పలికింది 'అలా తోటలోనికి వెళదాం'.

రతిని అనుసరించాడు రాజు.

పచ్చగడ్డిమీద పక్క-పక్క-గా నడుస్తున్నా రిద్దరు. రతి చెప్పులతో నడుస్తోంది.

'మీ అందమైన పాదాల స్పర్శను ఈ పచ్చగడ్డి నోచుకోలేదా?' అన్నాడు రాజు.

రతికి పూర్వ వృత్తాంతం జ్ఞాపకం వచ్చింది. గిరుక్కున వెనక్కు తిరిగి బొటనవేలు కొరుకుతూ నవ్వుకుంది. చెప్పులు విసురుగా విడిచేసి రాజువైపు తిరిగి చూసింది. అత నేదో నవ్వుతూ అన్నాడు. రతికి ఏమి విన్పించటం లేదు. అతని

చిరునవ్వు వెన్నెల. అతని పెదవులు కృష్ణలీలామృతపు ఝురులు.

జాజి పందిరి కింద కూర్చున్నా రిద్దరూ. రతి మోకాళ్ళ మీద గడ్డం ఆన్చి రాజులోకి చూస్తూ అంది—'చెప్పండి.'

'నేనేం చెప్పగలను....నా దేవత ఏమన్నా చెప్తే వింటాను' అన్నాడు రాజు.

'ఊఁ...' అని మూతి గుండ్రంగా తిప్పింది రతి. పెదవులు మన్మథ బాణంలా వంగాయి.

'అయినా దేవత తన దేవుడికేం చెప్పగలదు?' నేల లోకి చూస్తూ అంది రతి.

గడ్డిపరక నిక్కినిక్కి చూసింది.

రాజు రతి చుబుకం పైకెత్తి తలని తనవైపు తిప్పుకున్నాడు. రతి రాజు హృదయంలో తలదాచుకుంది. రాజు బలమైన చేతులు లతలాంటి రతి శరీరాన్ని పెనవైచినై. రతి దేహావయవాలు పట్టుతప్పినై. రతిలో లావా వెల్లువై పొర్లింది. సర్వమూ ఏకమై ఇది – అది అని ఏమీ మిగలక, తమ అస్తిత్వం అణువై, పరమాణువై ఆనందంలో ఐక్యమౌతున్నట్లనిపించింది వారిద్దరికీ. జగత్తులోని సౌకుమార్యాలన్నీ రెండుగా విడిపోయి తిరిగి ఒకదాన్నొకటి ఆప్యాయంగా కలుసుకుంటున్నట్లు వారి పరిచుంబన, కోరిక రూపుకట్టి సిద్ధిని పొందుతున్నట్లు వారి గాఢ పరిష్వంగం ... కొమ్మమీద గువ్వలజంట 'చూడుచూడని' ముక్కులు పొడుచుకున్నాయి.

రతికి ఒళ్ళు తెలిసి కళ్ళు తెరిచి చూసేసరికి తను రాజు కౌగిట్లో ఉంది. రాజు తనలోనే చూస్తున్నాడు. మత్తుగా తిరిగి కళ్ళుమూసికొని రాజునిగాఢంగా కౌగలించుకుంది. రతికి

తన ప్రభువు కరుణించినట్లైంది. రాజుకి తన దేవత అనుగ్రహించినట్లైంది. ఆ పరస్పర ఆరాధకులకు తెలియకుండా చంద్రోదయమైంది.

రతి, రాజుని ఆ రోజు తనతో భోజనం చెయ్యమని బలవంతం పెట్టింది. కొసరి కొసరి వడ్డన చేయించింది. భోజనమైన తర్వాత రాజుకి ఆకులు మడిచి ఇచ్చింది. రతికి శరీరమంతా గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. గబగబా మాటలు దొర్లించి కబుర్లు చెప్తోంది, కిలకిల నవ్వుతోంది. మాటలు చెప్తూ నవ్వుతూ మధ్య మధ్య రాజు ముంగురులు దిద్దుతోంది. కొంగుతో అతడి నుదుటి చెమటను అద్దుతుంది. సగంలో ఆపి, రాజు ముక్కు గిల్లి 'వింటున్నావా ?' అంటుంది. రాజు మాట్లాడకుండా తల అటూ ఇటూ తిప్పుతాడు. రతి మువ్వలు కుదిలించినట్లు నవ్వుతుంది.

ఉన్నట్టుండి రాజు 'ఒక్కసారి నృత్యం చేస్తావా ?' అనడిగాడు.

'అంతకంటేనా – ఒక్క నిముషం' అని పక్క గది లోకి వెళ్లింది రతి.

పది నిముషాల తర్వాత ద్వారం ముందు కిన్నెర సాక్షాత్కరించింది. రాజు చకితుడయ్యాడు. ఒయ్యారంగా రాజు వద్దకు వచ్చి పాదాభివందనం చేసింది. 'వద్దు వద్దు' అని రాజు చేతులు పట్టుకోబోయాడు. జారిపోయింది.

నాట్యంలో రతి లేడి పిల్లలా చెంగున దూకింది. తటిల్లతలా మెరిసింది. ఎక్కడలేని ఆవేశాన్ని పొందింది. మెలికలుతిరిగిపోయింది. కాలిగజ్జెలు సంగీతజ్ఞులై పొంగాయి. రతి అపురూపములైన హస్తపద విన్యాసాలు చూపింది. తన

నాట్య విశేషసర్వాన్ని ఆవిష్కరించింది. సర్వమూ సమర్పణ చేసింది. రాజు తన్మయత్వంతో మైమరపు చెందాడు.

'ఏమిటిదంతా?' గట్టిగా అరిచాడు, అప్పుడే గదిలోకి వచ్చిన పద్మనాభరావు. ఆయన వెనకాల గురూజీ ఉన్నాడు.

మద్రాసులో పని పూర్తిచేసికొని అప్పుడే బండి దిగారిద్దరూ.

'నాన్నా ...'

'ఎవరాయన? ఏమిటిదంతా ....' అయోమయంలో పడ్డాడు పద్మనాభరావు. సరిగ్గా అదే స్థితిలో మాట రావటం లేదు గురూజీకి.

'చెప్తానుండు నాన్నా' గ్లాసు మంచినీళ్ళు తాగి చెప్పింది రతి. 'వారు రాజు, వారిని నేను పెళ్లి చేసుకోబోతున్నాను.'

'పెళ్ళా! నీ కేమైనా మతిపోయిందా .... .... ఏమిటీ మాటలు' తెంచుకుని అరిచాడు పద్మనాభరావు.

'అవును నాన్నా! నేను అన్నీ ఆలోచించుకునే ఈ మాట చెప్తున్నాను.'

'నీకేం దయ్యం పట్టలేదు గదా! భారతదేశ పర్యటనకి మేమంతా సిద్ధంచేసి వస్తే పెళ్ళి చేసికొంటాననంటావేం?'

'నేను పర్యటనకు రాను. నాకు ఖ్యాతి అక్కర్లేదు.'

'ఆఁ! నా ఆశలన్నీ బుగ్గిచేశావ్! నువ్వు ఈ ఇంట్లో ఉండి నన్నేం ఉద్ధరిస్తావ్?'

'ఇప్పుడే వెళ్ళిపోతాను నాన్నా!' అని రతి ఇంట్లోకి వెళ్ళి పది నిముషాల్లో బట్టలు సర్దుకొని సూట్ కేస్‌తో తిరిగి వచ్చింది.

గురూజీ గొంతు సవరించుకొని 'అమ్మా, రతీ! నీకు దేశంలో, విదేశాల్లో పెద్ద పేరు తీసుకురావాలని మీ నాన్న కలలు కంటున్నారు ...' అని చెప్పారు.

'నన్ను క్షమించండి. ఈ విషయంలో వాదన కాని, తర్కంకాని ప్రవేశపెట్టకండి. ఇది ఒక్కొక్కళ్ళ వ్యక్తిగతమైన తత్వానికి సంబంధించినది. మీరు నిర్ణయించిన మార్గం నా ఒంటికి పడదు. శలవు' అని రతి రాజు చెయ్యి పట్టుకుని గేటుదాటి వెళ్లిపోయింది.

గురూజీ పద్మనాభరావు బొమ్మల్లా నిల్చుండి పోయారు.

ఆ తర్వాత తరుచూ రతి ఉత్తరాలు రాస్తున్నా పద్మ నాభరావు రతి ఇంటికి వెళ్ళలేదు. తన యింటికి రప్పించలేదు. మూడు సంవత్సరాల తర్వాత ఒకనాడు రతి నుంచి ఉత్తరం వచ్చింది. తనకి కూతురు కల్గిందని, మహతి అని పేరు పెట్టా మని, మనుమరాలికి తాతగారి ఆశీర్వచనం అవశ్యంకావాలనీ. ఆ ఉత్తరం చూసి 'మా మహతిని తప్పకుండా నాట్యలక్ష్మికి అంకితం చేయిస్తాను' అని పెట్టా, బెడ్డింగు సర్దుకొని రతి ఇంటికి బయల్దేరాడు పద్మనాభరావు.